జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు
ఎడిటర్ : 90520 45435

మంగళవారం 13-01-2026 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :227 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : కాసే అమృత

# చలానా పడిన వెంటనే..

## ఖాతా నుంచి చెల్లింపు జరగాలి: రేవంత్‌రెడ్డి



చలానాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సీఎం రేవంత్ రెడ్డి పోలీసులకు కీలక సూచనలు చేశారు.



హైదరాబాద్: చలానాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సీఎం రేవంత్ రెడ్డి పోలీసులకు కీలక సూచనలు చేశారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' రోడ్ సేఫ్టీ ప్రచార కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. "వాహనంపై చలాన్ పడిన వెంటనే బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు కట్ అయ్యేలా చూడాలన్నారు. యజమాని వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించడానికి వచ్చినప్పుడే బ్యాంక్ ఖాతా వివరాలు తీసుకోండి. ఆ వివరాలు సింక్ చేయండి. చలాన్ పడిన వెంటనే ఆటోమేటిక్‌గా డబ్బులు ఖాతా నుంచి కట్ కావాలి" అని రేవంత్ అన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల దేశ జీడీపీలో 3 శాతం మేర నష్టం జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్..

## పతంగి ఎగురవేసిన ప్రధాని మోదీ

ప్రధాని నరేంద్రమోదీ సోమవారం అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్‌తో కలిసి ఈ వేడుకలో పాల్గొన్నారు. ప్రస్తుతం గుజరాత్ పర్యటనలో ఉన్న మోదీ.. అహ్మదాబాద్‌లోని సబర్మతి నదీతీరంలో జరుగుతోన్న ఈ ఫెస్టివల్‌లో ఛాన్సలర్‌తో కలిసి కైట్ ఎగురవేశారు. ఈ ఉత్సవంలో 50 దేశాలకు చెందిన ఔత్సాహికులు పాల్గొన్నారని గుజరాత్ ప్రభుత్వం వెల్లడించింది. ఇందులో హనుమాన్ పతంగి ఆకర్షణగా నిలిచింది. గత ఏడాది ఈ ఫెస్టివల్‌కు 3.83 లక్షల మంది సందర్శకులు వచ్చారు. ఈ ఏడాది ఆ సంఖ్య 5 లక్షలకు వరకు ఉండొచ్చని తెలుస్తోంది. ఇక్కడికి వచ్చేవారు ధోలవీర, ఐక్యతా విగ్రహాన్ని కూడా సందర్శిస్తున్నారని, దీనివల్ల రాష్ట్ర పర్యాటకానికి ఊతం లభిస్తోందని పేర్కొంది.



# యూటర్న్ తీసుకుని సూచీలు రయ్ రయ్..

ముంబయి: అమెరికా టారిఫ్ భయాలు.. విదేశీ మదుపర్ల అమ్మకాలతో ఉదయం భారీ నష్టాల్లో మొదలైన సూచీలు.. అనూహ్యంగా యూటర్న్ తీసుకున్నాయి. దాదాపు 700 పాయింట్లకు పైగా నష్టపోయిన సెన్సెక్స్.. 25,500 దిగువకు వెళ్లిన నిఫ్టీ.. మళ్లీ లాభాల బాట పట్టాయి. అదీ కేవలం గంట వ్యవధిలోనే. అంతలా మార్కెట్‌ను ప్రభావితం చేశారు భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్. అంబాసిడర్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా

పేజి 2లో ▶

## గంటలో స్టాక్ మార్కెట్‌లో మారిన సీన్



# రిట్ విషయంలో సీఎం రేవంత్ తీరును ప్రజాక్షేత్రంలో ఎండగడతాం: హరీశ్ రావు

నిజస్వరూపం బయటపడింది: గతంలో పాలమూరు ప్రాజెక్టుపై ఏపీ ప్రభుత్వం అడ్డంకులు సృష్టించిందని, ఇప్పుడు రేవంత్ రెడ్డి మాత్రం తెలంగాణ హక్కులను ఏపీకి దారదత్తం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

చర్చల వెనుక మర్మం: "కోర్టులు వద్దు.. చర్చించుకుందాం" అని రేవంత్ రెడ్డి అనడం వెనుక ఉద్దేశం తెలంగాణ నీటి హక్కులను ఏపీకి అప్పగించడమేనా? అని ప్రశ్నించారు.



2లో

# శిర్డీ సాయినాథుడ్ని దర్శించుకున్న మంత్రి లోకేశ్ దంపతులు



అమరావతి: శిర్డీలోని సాయినాథుడ్ని ఏపీ మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి బ్రాహ్మణి దర్శించుకున్నారు. సాయిబాబాకు నిర్వహించే కాగడ హారతి, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. మంత్రి లోకేశ్ దంపతులకు ఆలయ ట్రస్ట్ సభ్యులు, అధికారులు స్వాగతం పలికి దుశ్శాలువతో సత్కరించారు. హారతి అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు. మంత్రి లోకేశ్ వెంట ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులు ఉన్నారు.

## రాజకీయ పార్టీగా ఉండేందుకు వైకాపాకు అర్హత లేదు: పార్థసారథి



2లో

## పండుగ రద్దీ వేళ 12 జన్‌సాధారణ్ ప్రత్యేక రైళ్లు.. రూట్..టైమింగ్స్ ఇవే!



2లో

# యూరియా ఇవ్వని వ్యక్తి..

## యూరియా ఇవ్వని వ్యక్తి..

## పాలమూరును సస్యశ్యామలం చేస్తారా?:

## సీఎం రేవంత్‌పై కేటీఆర్

- పరిశ్రమల తరలింపు: గత ప్రభుత్వ హయాంలో తాము తెచ్చిన 14 పరిశ్రమలు ఇప్పుడు రేవంత్ రెడ్డి తీరు వల్ల రాష్ట్రం నుంచి వెళ్లిపోయే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ ఆరోపించారు.
- యూరియా మరియు రైతుల సమస్య: రైతులకు కనీసం యూరియా కూడా అందించలేకపోయిన వ్యక్తి, పాలమూరును సస్యశ్యామలం చేస్తామనడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.



2లో

## ఆత్రేయపురంలో 'సంక్రాంతి' సందడి.. ప్రారంభమైన పడవల పోటీలు



రావులపాలెం పట్టణం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో సంక్రాంతి సంబరాలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా మూడు రోజుల పాటు 'సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ' పేరిట వివిధ పోటీలకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. తొలిరోజు ఈత, రంగవల్లుల పోటీలు, ఫుడ్ ఫెస్టివల్ జరిగాయి.

పేజి 2లో ▶

## పోలవరం - నల్లమల సాగర్ వల్ల తెలంగాణకూ ఉపయోగం: మంత్రి నిమ్మల



అమరావతి: తెలుగు రాష్ట్రాలు సోదరభావంతో అభివృద్ధి చెందాలన్నది ఏపీ సీఎం చంద్రబాబు ఆకాంక్ష అని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పోలవరం - నల్లమల సాగర్‌కు ఎలాంటి అభ్యంతరాలు చెప్పొద్దని తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది కూడా 4,600 టీఎంసీల నీరు సముద్రంలో కలిసిందని గుర్తు చేశారు.

పేజి 2లో ▶

## నీతిఆయోగ్ సూచనలతో ఉపాధి హామీ పథకంలో మార్పులు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



2లో

# సంపాదకీయం

## ‘సర్’ కుత్సితం, ఓటు పరిహాసం

రాష్ట్ర ప్రభుత్వాలపై గవర్నర్ల స్వారీ నుంచి రాష్ట్రపతి స్థానాన్ని తక్కువ చేయడం వరకూ రాజ్యాంగ వ్యవస్థల దుర్వినియోగం, వీటిపై అత్యున్నత న్యాయస్థానంలోనే ఆలస్యాలు, అరకొర సాంకేతిక సమర్థనలూ మోడీ ప్రభుత్వ హయాంలో పరిపాటిగా మారాయి. అత్యున్నత న్యాయ వ్యవస్థలోనూ వివాదాస్పద పరిణామాలు సంభవిస్తున్నాయి. వీటిలో మరింత ఆందోళనకరమైందీ, ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన ఓటుకే చేటు తెచ్చేది ‘సర్’ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) తతంగం. దీనిపై ప్రతిపక్షల విమర్శలు తప్ప బడా మీడియాలో ఎలాంటి తీవ్ర చర్చ జరక్కపోవడం ఆశ్చర్యమేగానీ అనూహ్యం కాదు. గత నెలలో ముగిసిన పార్లమెంటు సమావేశాలలోనూ ‘సర్’ను చర్చకు పెట్టడానికి తీవ్ర పోరాటం అవసరమైంది. ఆ చర్చలో పాల్గొంటూ హెూంమంత్రి అమిత్ షా ఈ దేశ ప్రధాని, ముఖ్యమంత్రి వంటి కీలక పదవులకు విదేశీయుల ఓట్లతో ఎన్నికయ్యే అవకాశం కల్పించబోము అని తీవ్ర హెచ్చరికలే చేశారు.

2024లో జరిగిన ఎన్నికల వరకూ దేశంలో అసలు ‘సర్’ అనే మాట లేదు. రాజ్యాంగం 324వ అధికరణం ఎన్నికల కమిషన్ నియామకం గురించి చెబుతుంటే 326వ అధికరణం మధ్యలో ఓటర్ల జాబితాల సవరణ పరిశీలన గురించి చెబుతుంది. దాన్ని స్పెషల్ రివిజన్, సమ్మరీ రివిజన్ అనే పేర్లతోనే పిలిచేవారు. 2024 ఎన్నికల తర్వాత 2025 జూన్‌లో బీహార్ శాసనసభ ఎన్నికలు జరగవలసి వుండగా నెల రోజుల ముందు ఎన్నికల సంఘం హఠాత్తుగా ఈ ‘సర్’ ప్రక్రియను ప్రకటించింది. అది కూడా నెల రోజుల లోపల పూర్తి కావాలని ఆదేశించింది. ఆరున్నర కోట్ల మంది ఓటర్లను అంత తక్కువ వ్యవధిలో పరిశీలించడం సాధ్యం కాదని చెప్పినా పెడచెవిని పెట్టింది. ఓటరు నమోదు కోసం పదకొండు పత్రాలలో ఏదైనా ఒకటి చూపించాలని చెప్పింది. చివరకు దాదాపు 69.5 లక్షల ఓట్లను తొలగించి శాసనసభ ఎన్నికలు జరిపింది. ఒక్క ఓటును కూడా చేర్చింది లేదు. అందుకే దీన్ని స్పెషల్ ఇంటెన్సివ్ రిమూవల్ (తొలగింపు) అనడమే సరైంది. బీహార్‌లో పోలింగ్ జరిగినప్పుడు తమ పేరు లేదంటూ అనేక చోట్ల ఓటర్లు ఆందోళన చేశారు. ఫలితం లేదు. ఆ వెంటనే మరో పన్నెండు రాష్ట్రాలలో ‘సర్’ చేపట్టారు. వీటిలో పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు వంటివి ఎన్నికలు జరగాల్సిన రాష్ట్రాలు మాత్రమే గాక బిజెపి యేతర పార్టీల పాలనలో వున్నాయి. యు.పి, గుజరాత్, గోవా వంటివి కూడా వున్నాయి. వీటన్నిటిలోనూ కోట్ల ఓట్లు తొలగించబడ్డాయి. తమిళనాడులోనే 97 లక్షల ఓట్లు, యు.పి లో 2.95 కోట్ల ఓట్లు తీసివేయడం కొన్ని దేశాల జనాభా కంటే ఎక్కువగా వుంది.

**అంతా రహస్యమే**

గతంలో ఓటరుగా చేరండంటూ ప్రచారోద్యమాలు నడిచేవి. ఓటరు ఐ.డినే గాక ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంకు ఖాతా, ఐడెంటిటీ కార్డు వంటివి నాలుగైదు పత్రాలలో ఏది తెచ్చినా చాలని ముందే ప్రకటించేవారు. ఇప్పుడు మొత్తం మారిపోయింది. ఎవరిని తొలగించారో జాబితా ఇవ్వడానికి కూడా ఎన్నికల సంఘం నిరాకరిస్తే సుప్రీం కోర్టు వెంటపడాల్సి వచ్చింది. ఇప్పటికైనా ఓటరు వారి బూత్‌లో చూసుకోవలసిందే గానీ తగిన వ్యవధితో సమగ్ర జాబితా లేకుండా పోయింది. ఇ.సి ఏర్పాటు పూర్తిగా ప్రధానమంత్రి చేతుల్లోకి వెళ్లిపోయింది. ఎన్నికల కమిషనర్లు పొరబాటు చేసినా చర్య తీసుకోకుండా ముందస్తు రక్షణ (ఇమ్యూనిటీ) కల్పిస్తూ చట్టం చేయబడింది.

దేశానికి గర్వకారణమైన నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్య సేన్‌కు కూడా విదేశీయుడు కాదని నిరూపించుకోవలసిందిగా నోటీసు ఇచ్చారు (సోనియా గాంధీ పౌరసత్వం పొందకుండానే ఓటరుగా నమోదైనారనే దానిపై ఢిల్లీ హైకోర్టు ముందే విచారణ జరుపుతున్నది.). దక్షణ గోవా కాంగ్రెస్ ఎం.పి విరియాటో ఫెర్నాండెజ్‌కు అధికార పత్రాలతో తన పౌరసత్వం నిరూపించుకోవలసిందిగా ఎన్నికల సంఘం నోటీసులిచ్చింది. ఆయన గతంలో 28 ఏళ్లపాటు నౌకాదళాధికారిగా పనిచేశారు. వీరందరూ చొరబాటుదారులు గనక ప్రత్యేకంగా నోటీసులు జారీ చేయవలసి వచ్చిందా? ‘సర్’ కేసు విచారిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ‘ఈ పత్రాలు ఇప్పటికిప్పుడు మేమే చూపించలేం. మామూలు మనుషులు ఎక్కడ చూపించగలర’ని ప్రశ్నించారు. 2003 ఓటరు జాబితాలను ఆధారంగా తీసుకుని 2025-26లో పోల్చి చూస్తే ఇలాంటి తేడాలు రాకుండా ఎలా వుంటాయి? అందులోనూ 39 శాతం మంది వలసలు పోయే బీహార్ వంటి చోట్ల ఇళ్ల సర్వేలో కనిపించలేదు గనక కోట్ల మందిని తీసేయడమేంటి?

**2003 దేనికి? పౌరసత్వం సవాలేంటి?**

ఈ గందరగోళం కావాలని సృష్టించిందే. ఎప్పుడైనా రెన్యువల్ లేదా వెరిఫికేషన్ అంటే వున్న పత్రాన్ని లేదా ఆధారాన్ని చూస్తారు. 2025లో వెరిఫికేషన్ అంటే అంతకు ముందు ఎన్నికలు జరిగిన నాటి జాబితాలు చూడాలి. 2019, 2014 ఎన్నికలకు ఉపయోగించిన జాబితాలు ఎందుకు అక్కరకు రాకుండా పోయాయి? అలాగే రాష్ట్రాలలోనూ అంతకు ముందు ఎన్నికల తేదీలను చూడాలి. కానీ 2003ను కొలబద్దగా ఎందుకు తీసుకున్నట్టు? గుజరాత్‌లో మారణకాండ అనంతరం ఎన్నికలు జరిపించి మోడీ రెండవసారి ముఖ్యమంత్రి కావడం, వెంటనే 2004 ఎన్నికలలో వాజ్‌పేయి ప్రభుత్వం ఓడిపోవడం అప్పుడే జరిగాయి. దానికీ ఈ ఎంపికకూ ఏమైనా సంబంధం వుందేమో ఇ.సి కే తెలియాలి కానీ మొత్తం ‘సర్’ పారదర్శకత్వాని నిగూఢ వ్యవహారంగా తయారైంది. ప్రస్తుత దఫా ముగిసిన తర్వాతనే ‘సర్’ ప్రక్రియ రాజ్యాంగ బద్దత తేలుస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రకటించడంబట్టి చూస్తే జరగబోయే శాసనసభ ఎన్నికలకు ఇదే కొనసాగడం తథ్యం. ఒక్క బిజెపి తప్ప ఏ జాతీయ పార్టీ గానీ చాలా ప్రాంతీయ పార్టీలు గానీ ‘సర్’ను బలపర్చడం లేదు. టిడిపి, జనసేన, వైసిపి, బిఆర్ఎస్ వంటివి మాత్రం వ్యతిరేక పోరాటం చేయడం లేదు.

రాజ్యాంగం రెండవ భాగంలో పౌరసత్వం సంబంధించిన నిబంధనలున్నాయి. 324వ అధికరణంలో ఓటర్ల జాబితాకు సంబంధించిన ఎన్నికల సంఘం అధికారాలు వున్నాయి. ఈ రెండు చోట్ల చూస్తే ఎక్కడా ఇ.సి పౌరసత్వం ఇస్తుందని కానీ నిర్ధారిస్తుందని కానీ లేదు. ఒక దశలో అంటే రాష్ట్రాల వాదన వినేప్పుడు సుప్రీం కోర్టు ధర్మాసనం కూడా ‘పౌరసత్వం మీ బాధ్యత కాదు కదా?’ అని ఇ.సి ని ప్రశ్నించింది. అదే సమయంలో మరోవైపు నుంచి ‘దేశ పౌరులు కాని వారికి ఓటు హక్కు

## యూరియా ఇవ్వని వ్యక్తి.. పాలమూరును సస్యశ్యామలం చేస్తారా?: సీఎం రేవంత్‌పై కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

మహబూబ్‌నగర్: బీఆర్ఎస్ హయాంలో పెట్టిన పరిశ్రమలకు ఇప్పుడు రిబ్బన్లు కట్ చేస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. మహబూబ్‌నగర్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమం జరిగింది. మహబూబ్‌నగర్‌లో ఐటీ హబ్ పెట్టి 14 పరిశ్రమలు తెస్తే ఇప్పుడు పారిపోయేలా చేశారని కేటీఆర్ ఆరోపించారు. పాలమూరు రైతన్నలను రేవంత్‌రెడ్డి ఎండపెడుతున్నారని విమర్శించారు. యూరియా ఇవ్వని వ్యక్తి పాలమూరును సస్యశ్యామలం చేస్తామంటున్నారంటూ ఎద్దేవా చేశారు.

“కృష్ణా జలాలు మన వద్ద ఉన్నప్పుడే తీసుకుంటే కిందకు వెళ్లవు. ఈ విషయంలో పాత బాస్‌కు కోపం రావద్దు.. కేసీఆర్‌కు పేరు రావద్దనేది రేవంత్ ఆలోచన. రేవంత్ రెడ్డి నిజాయతీ గల మోసగాడు. ప్రజలు మోసగాళ్లనే నమ్ముతారని రేవంత్ చెప్పేవారు. పదేపదే మోసపోతే ప్రజలదే తప్పు అవుతుంది. అభివృద్ధి పనులకు డబ్బులు లేవని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారు. డబ్బులు మూటలు కట్టి దిల్లీకి పంపితే రాష్ట్రంలో పనులకు ఎలా వస్తాయి? ఆంధ్రా కాంట్రాక్టర్లకు సీఎం పెద్దపీట వేస్తున్నారని జడ్చర్ల ఎమ్మెల్యేనే అంటున్నారు. తమ ప్రభుత్వం వస్తుందో? రాదో? తెలియదు. హామీ ఇవ్వనని జూపల్లి చెప్పారు. హామీలు, పథకాల అమలు గురించి ప్రశ్నిస్తే దూషిస్తున్నారు. అదృష్టం బాగుండి రేవంత్ సీఎం అయ్యారు” అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

ఇప్పుడు గుర్తులు ఉంటాయ్..

“సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ గుర్తు లేకుండా ఎన్నికలు జరిగాయి. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గుర్తు ఉంటుంది. మున్సిపల్ ఎన్నికల్లో మన పార్టీ సత్తా ఏంటో చూపించాలి. కేవలం కేసీఆర్, కారు గుర్తును మాత్రమే గుర్తు పెట్టుకోవాలి. అన్నీ ఆలోచించే అభ్యర్థిని బీఆర్ఎస్ నిలబెడుతుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లేకపోయినా కేసీఆర్ ఉంటారని ప్రజలు భావించారు. ఎమ్మెల్యేలు లేకుంటే కేసీఆర్ ఎలా ఉంటారనే లాజిక్ మరిచారు. అందుకే, మళ్లీ తప్పు చేయకుండా, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేయాలి. రెండేళ్ల తర్వాత కేసీఆర్ అధికారంలోకి వచ్చాకే అభివృద్ధి పనులు పరుగులు పెడతాయి. కొడంగల్ సహా 14 స్థానాల్లో కాంగ్రెస్‌ను ఈసారి ప్రజలు బొందపెడతారు. జిల్లాలను ముట్టుకుంటే అగ్గి రగులుతుంది. కాంగ్రెస్‌ను దహించివేస్తుంది” అని కేటీఆర్ అన్నారు.

## పోలవరం - నల్లమల సాగర్ వల్ల తెలంగాణకూ ఉపయోగం: మంత్రి నిమ్మల

మొదటి పేజీ తరువాయి

పోలవరం దగ్గర వరదనీరు వాడుకోకుంటే నీళ్లన్నీ సముద్రం పాలవుతాయని అన్నారు. “గోదావరిలో పుష్కలంగా నీరుందనే కాళేశ్వరానికి మేం అభ్యంతరం చెప్పలేదు. పోలవరం - నల్లమల సాగర్ వల్ల తెలంగాణకు కూడా ఉపయోగం ఉంది. ఏపీకి సరిపోగా నీరు మిగిలితే తెలంగాణ కూడా వాడుకోవచ్చు. అందుకే, పోలవరం - నల్లమల సాగర్ వల్ల తెలంగాణకూ నష్టం లేదని చెబుతూనే ఉన్నాం. సముద్రంలో కలిసే 3 వేల టీఎంసీల్లో 200 టీఎంసీలు వాడుకుంటామన్నాం. గత 50 ఏళ్లలో గోదావరి నుంచి 1.53 లక్షల టీఎంసీలు సముద్రంలో కలిశాయి” అని నిమ్మల వెల్లడించారు.

## ఆత్రేయపురంలో ‘సంక్రాంతి’ సందడి.. ప్రారంభమైన పడవల పోటీలు

మొదటి పేజీ తరువాయి

రెండో రోజు డ్రాగన్ పడవల పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, అధికారులు ప్రారంభించారు. దీనిలో పాల్గొనేందుకు పలు రాష్ట్రాల నుంచి సుమారు 250 మంది వచ్చారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలిరావడంతో ఆత్రేయపురంలో సందడి వాతావరణం నెలకొంది.

## నీతిఆయోగ్ సూచనలతో ఉపాధి హామీ పథకంలో మార్పులు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: వీబీ జీ రామ్‌జీ ఉపాధి హామీ పథకం మీద కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. కొత్త చట్టంతో ఈ పథకంలో సాంకేతికత ఉపయోగించామన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడంతో పాటు వంద రోజుల పనిదినాలను 125కి పెంచామన్నారు. వ్యవసాయ సీజన్‌లో కూలీల కొరత లేకుండా.. వ్యవసాయానికి అనుసంధానం చేస్తున్నామన్నారు. వ్యవసాయ సీజన్ లేనప్పుడు 125 పని దినాలు దొరికేలా చూస్తామన్నారు.

“ఈ పథకం ద్వారా రాష్ట్రాలకి అదనపు భారం పడుతుంది. అయితే, కేంద్రం కూడా అదనంగా ఖర్చు పెడుతుంది. కూలీల పేరుతో నకిలీ జాబ్ కార్డులు తయారు చేసే దళారీ వ్యవస్థను నిర్మూలించడమే ఈ చట్టం ఉద్దేశం. నీతి ఆయోగ్ సూచనలతో కొత్త ఉపాధి హామీ పథకంలో మార్పులు చేశాం”అని తెలిపారు.

**అదే అయితే మూడుసార్లు ఎలా గెలుస్తాం?**

భాజపా గాలివాటంతో గెలుస్తుందన్న కేటీఆర్ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. గాలివాటం అయితే దేశంలో మూడు సార్లు అధికారంలోకి ఎలా వచ్చామో చెప్పాలన్నారు. మళ్లీ గెలిచి దేశంలో ప్రధానిగా మోదీ అధికారంలోకి వస్తారన్నారు. బీఆర్ఎస్ పని అయిపోయిందని ఎద్దేవా చేశారు. పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి చూపించామన్నారు.

**అక్కడకు వెళ్లి అలా అడుగుతారా?**

హిజాబ్ ధరించే మహిళను ప్రధాని చేయాలని మజ్లీస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యల పట్ల కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌కు వెళ్లి బొట్టు పెట్టుకునే హిందువును ప్రధాని చేయాలని ఓవైసీ అడుగుతారా అని ప్రశ్నించారు. పాకిస్థాన్‌లో హిందువులు లేకుండా చేశారని, బంగ్లాదేశ్‌లో హిందువులను హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో హిందువులు లేకుంటే ప్రజాస్వామ్యం ఉండదన్నారు. మతాల పేరు మీద రాజకీయాలు నడవవని ఓవైసీ గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు.

## చలానా పడిన వెంటనే.. ఖాతా నుంచి చెల్లింపు జరగాలి: రేవంత్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

ప్రతి నిమిషానికో రోడ్డు ప్రమాదం జరుగుతోందని, 3 నిమిషాలకో ప్రాణం పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాద నివారణకు పోలీసుశాఖ ప్రణాళిక చేపట్టిందన్నారు. రాష్ట్ర పోలీసు వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. “సమాజంలో కొందరి నిర్లక్ష్యం మరొకరికి ప్రాణాపాయంగా మారుతోంది. రోడ్డు ప్రమాదాలపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాలి. ఫిజికల్ క్రైమ్‌తో పాటు సైబర్ నేరాలు భారీగా పెరిగిపోయాయి. సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేశాం. వీటి నియంత్రణలో హైదరాబాద్ ప్రథమ స్థానంలో ఉంది”అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

**ఈ ఉద్యమంలో అందరూ పాల్గొనాలి: డీజీపీ శివధర్‌రెడ్డి**

ప్రమాదాల నివారణ కోసం అరైవ్ అలైవ్ అనే ఈ ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నామని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఇందులో పోలీసులు, రవాణా శాఖ పని మాత్రమే కాదు.. ప్రజాప్రతినిధులు, ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. గతేడాది రోడ్డు ప్రమాదాలు పెరిగినా.. విస్తృత అవగాహనతో మరణాల సంఖ్య తగ్గిందని చెప్పారు. అందరూ కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. జనవరి 13 నుంచి 24 వరకు పది రోజుల పాటు అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

## తెలంగాణ ప్రాజెక్టులకు నేనెప్పుడూ అడ్డు చెప్పలేదు: ఏపీ సీఎం చంద్రబాబు

అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తున్నామన్నారు. పోలవరం అద్భుతమైన ప్రాజెక్టు అని.. అది పూర్తయితే దక్షణ భారతంలో ఏ రాష్ట్రమూ మనతో పోటీ పడలేదని చెప్పారు. నల్లమలసాగర్ ద్వారా రాయలసీమ ప్రాంతంతో పాటు ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాలకు నీరు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం లేదన్నారు. ఎగువ నుంచి వదిలిన నీళ్లు పోలవరం నుంచి నల్లమల సాగర్‌కు తీసుకెళ్లి వాడుకుంటే తప్పేంటని ప్రశ్నించారు. పోలవరంలో మిగిలిన నీటిని తెలంగాణ కూడా వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆ రాష్ట్రంలో ప్రాజెక్టులు కట్టినప్పుడు తానెప్పుడూ అడ్డు చెప్పలేదని సీఎం గుర్తుచేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టును త్వరలోనే జాతికి అంకితం చేస్తామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వ సహకారంతో కాపాడుకున్నామని వివరించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల సెంటిమెంట్ అని.. ఆ ప్లాంట్‌ను నిలబెట్టి తీరుతామన్నారు. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయని తెలిపారు. పెట్టుబడులకు డెస్టినేషన్‌గా రాష్ట్రం మారిందన్నారు. ఎస్ఐపీబీ ద్వారా రూ.8.74లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామని.. వాటి ద్వారా కూడా పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తాయన్నారు.

## రిట్ విషయంలో సీఎం రేవంత్ తీరును ప్రజాక్షత్రంలో ఎండగడతాం: హరీశ్ రావు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: పోలవరం - నల్లమల సాగర్‌కు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. సీఎం రేవంత్ నిజస్వరూపం, ద్రోహబుద్ధి సుప్రీంకోర్టు సాక్షగా బట్టబయలైందన్నారు. గతంలో పాలమూరు ప్రాజెక్టుపై రైతులతో ఏపీ రిట్ వేయించి స్టే తెచ్చుకుందని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కార్ విచారణార్హత లేని పిటిషన్ వేసి రాష్ట్రానికి అన్యాయం చేసిందని ఆరోపించారు. తెలంగాణ నీటి హక్కులను ఏపీకి ధారాదత్తం చేస్తూ రేవంత్ రెడ్డి ద్రోహం చేస్తున్నారని విమర్శించారు.

“రిట్ ఉపసంహరించుకుని సివిల్ సూట్ ఫైల్ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం అంటోంది. దీంతో పోలవరం - నల్లమల సాగర్ ప్రాజెక్టు కట్టుకోవడానికి ఏపీకి గడువు ఇచ్చినట్లైంది. నాలుగు రాష్ట్రాల వాదనలు వినడమనేది ఏళ్లు గడిచినా ముగియని కథే. ఈలోగా ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు పనులను పూర్తి చేసుకుంటుంది. తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తూ ఏపీ నీళ్లు తరలించుకుపోతుంది. సుప్రీంకోర్టులో బలహీన రిట్.. సంక్రాంతి వేళ చంద్రబాబుకు రేవంత్ ఇచ్చిన గిఫ్ట్. టెండర్ చివరి తేదీ తర్వాత కోర్టుకు వెళ్లి నల్లమల సాగర్‌కు పరోక్షంగా రేవంత్ అంగీకరించారు. పసలేని రిట్ వేసి సంపూర్ణంగా నల్లమల సాగర్‌కు మద్దతు ఇచ్చారు. పంచాయితీలు, కోర్టులు వద్దు.. చర్చించుకుందామన్న రేవంత్ మాటల ఆంతర్యమేంటి? తెలంగాణ నీటి హక్కులను గుంపగుత్తగా ఏపీకి అప్పజెప్పడమేనా చర్చల లక్ష్యం. రేవంత్ రెడ్డి.. గురు దక్షణ కోసం ద్రోహం చేస్తుంటే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు. రేవంత్ రెడ్డి దుర్మార్గాన్ని ప్రజాక్షత్రంలో ఎండగడతాం. తెలంగాణ నీటి హక్కుల కోసం పోరాడుతాం” అని హరీశ్ రావు తెలిపారు.

## యూటర్న్ తీసుకుని సూచీలు రయ్ రయ్..

మొదటి పేజీ తరువాయి

ఆయన చేసిన వ్యాఖ్యలు మార్కెట్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

భారత్- అమెరికా కీలక భాగస్వాములని సెర్గియో వ్యాఖ్యానించారు. మిత్రులన్నాక అభిప్రాయ భేదాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జనవరి 13న ఇరు దేశాల మధ్య తదుపరి దశ వాణిజ్య చర్చలు ఉంటాయని చేసిన వ్యాఖ్యలు మార్కెట్‌కు బూస్ట్ ఇచ్చాయి. దీంతోపాటు సిలికాన్ సరఫరా కోసం అమెరికా నేతృత్వంలో వ్యూహాత్మకంగా ఏర్పాటైన ప్యాక్స్‌సిలికాన్ కూటమిలోకి భారత్‌ను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొనడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. దీంతో ఐదు రోజుల వరుస నష్టాల నుంచి మార్కెట్‌లు గట్టెక్కాయి. సెన్సెక్స్ కనిష్ఠాల నుంచి దాదాపు 1100 పాయింట్ల మేర రికవర్ అయ్యింది.

**సూచీల గమనం ఇలా..**

సెన్సెక్స్ ఉదయం 83,435.31 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,576.24) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 82,861.07 వద్ద కనిష్ఠాన్ని తాకింది. సెర్గియో గోర్ ప్రకటన తర్వాత లాభాల బాట పట్టిన సూచీ.. ఇంట్రాడేలో 83,962.33 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 301.93 పాయింట్ల 83,878.17 వద్ద ముగిసింది. 25,473.40 వద్ద కనిష్ఠాన్ని తాకిన నిఫ్టీ.. ఇంట్రాడేలో 25,813.15 వద్ద గరిష్ఠానికి చేరుకుంది. చివరికి 106.95 పాయింట్ల లాభంతో 25,790.25 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.16గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్, ట్రెంట్, ఎస్‌బీఐ, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, బీఈఎల్, ఎల్‌అండ్‌టీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు మాత్రమే నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 63.02 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు రికార్డు స్థాయిలో 4,589 డాలర్ల వద్ద కొనసాగుతోంది.15న సెలవు: మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో స్టాక్ మార్కెట్‌కు ఈ నెల 15వ తేదీన సెలవు రానుంది. ఈక్విటీ, డెరివేటివ్స్, కమొడిటీ, ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్స్ కార్యకలాపాలు నిలిచిపోనున్నాయని ప్రధాన స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈ వెల్లడించాయి.

## రాజకీయ పార్టీగా ఉండేందుకు వైకాపాకు అర్హత లేదు: పార్థసారథి

మొదటి పేజీ తరువాయి

అమరావతి: తిరుమలలో వైకుంఠ ద్వారా దర్శనాలు చక్కగా నిర్వహించామని ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. దర్శనాలు సమర్థంగా నిర్వహించామనే విషయాన్ని వైకాపా తట్టుకోలేపోతుందని విమర్శించారు. తిరుమలలో అపవిత్రం జరిగిందని దుష్ప్రచారం చేసేందుకు కుట్ర పన్నారని మండిపడ్డారు. కుట్రలు పన్నినవారంతా పోలీసులకు చిక్కారని, నిందితులు భూమన కరుణాకర్‌రెడ్డి అనుచరులని తిరుపతిలో చెప్పుకొంటున్నారని తెలిపారు.

## పండుగ రద్దీ వేళ 12 జన్‌సాధారణ్ ప్రత్యేక రైళ్లు.. రూట్.. టైమింగ్స్ ఇవే!

మొదటి పేజీ తరువాయి



సంక్రాంతి పండుగ రద్దీ నేపథ్యంలో రైల్వే అధికారులు మరికొన్ని ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తెచ్చారు. విశాఖ-విజయవాడ మధ్య 12 జన్‌సాధారణ్ (అన్ రిజర్వుడ్) రైళ్లను నడుపుతున్నట్లు ప్రకటించారు. జనవరి 12, 13, 14, 16, 17, 18 తేదీల్లో ఈ రైళ్లు సర్వీసులందించనున్నాయి. విశాఖ - విజయవాడ జన్‌సాధారణ్ ఎక్స్‌ప్రెస్ (08567) రైలు నిర్ణీత తేదీల్లో విశాఖలో ఉదయం 10 గంటలకు బయల్దేరి సాయంత్రం 4 గంటలకు విజయవాడ చేరుకోనుంది. అలాగే, విజయవాడ - విశాఖ ప్రత్యేక రైలు (08568) విజయవాడలో సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరి రాత్రి 12.35 గంటలకు విశాఖ చేరుకోనుంది. ఈ ప్రత్యేక రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, గన్నవరం స్టేషన్ల మీదుగా రాకపోకలు కొనసాగించనున్నాయి.

# దివ్యాంగులు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం అండగా నిలుస్తోంది - సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జ్యోతిరావు పూలే ప్రజాభవన్ సమాజంలో దివ్యాంగులు ఆత్మగౌరవంతో, ధైర్యంగా నిలబడేలా ప్రభుత్వం మానవీయ కోణంతో పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దివ్యాంగులు కుటుంబానికి భారమవుతున్నామనే భావనతో ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి దివ్యాంగులకు వివిధ సహాయ ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, ధనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాల భరోసా కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. అలాగే వయోవృద్ధుల సంక్షేమం కోసం “ప్రణామ్” పేరుతో ఏర్పాటు చేస్తున్న డే--కేర్ సెంటర్లను



వర్చువల్‌గా ఆవిష్కరించారు. దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాల కోసం ప్రభుత్వం రూ. 50 కోట్లు కేటాయించిందని, ఇది వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి దోహదపడుతుందని తెలిపారు. దివ్యాంగులు విద్య, ఉద్యోగాలు, క్రీడలు వంటి అన్ని రంగాల్లో ముందుకు రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చెప్పారు. దివ్యాంగులు దివ్యాంగులను వివాహం చేసుకుంటే రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందించే నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ప్యారా ఒలింపిక్స్‌లో రాణించిన యువతికి ఉద్యోగం కల్పించామని గుర్తు చేశారు. దివ్యాంగులకు సూదిని జైపాల్ రెడ్డి స్ఫూర్తిగా నిలుస్తారని, వైకల్యాన్ని అడ్డంకిగా మార్చుకోకుండా దేశంలో గొప్ప నాయకుడిగా ఎదిగిన ఆయన జీవితం ఆదర్శమని సీఎం పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్ల విషయంలో కూడా ప్రభుత్వం మానవత్వంతో వ్యవహరిస్తోందని, వారికి ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడంతో పాటు మున్సిపల్ కార్పొరేషన్లలో కో-ఆప్షన్ సభ్యులుగా ఒక ట్రాన్స్‌జెండర్‌ను నామినేట్ చేయాలని సూచించామని తెలిపారు. దీనిపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. వయోవృద్ధుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం, దేశంలోనే తొలిసారిగా ప్రణామ్ డే--కేర్ సెంటర్లు ప్రారంభిస్తోందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే వారి జీతాల్లో నుంచి 10--15 శాతం కోత విధించి ఆ మొత్తాన్ని తల్లిదండ్రుల ఖాతాలో జమ చేసేలా చట్టసవరణ అవసరమని అభిప్రాయపడ్డారు. రాబోయే బడ్జెట్ సమావేశాల్లో సమగ్ర హెల్త్ పాలసీ తీసుకువస్తామని, పేదలకు వందశాతం వైద్య సహాయం అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని సీఎం తెలిపారు. తెలంగాణలో కుల గణన, ఎస్సీ వర్గీకరణ వంటి చారిత్రక నిర్ణయాలు అమలు చేశామని, 2026 జనాభా లెక్కల్లో తెలంగాణ మోడల్‌ను దేశం అనుసరిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా రెట్రోఫిటెడ్ మోటరైజ్డ్ వాహనాలు, బ్యాటరీ త్రిచక్ర వాహనాలు, బ్యాటరీ వీల్ చైర్లు, ల్యాప్‌టాప్‌లు, వినికిడి యంత్రాలు, మొబైల్ ఫోన్లు తదితర పరికరాలను పంపిణీ చేశారు.

# సజ్జాపూర్ ఘటన బాధితుడికి దళిత సంఘాల అండ

సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 12జనవరి



జహీరాబాద్ నియోజకవర్గం కోహిర్ మండలం సజ్జాపూర్ గ్రామంలో జరిగిన ఘటనలో బాధితుడైన బేగరీ రాములను రాజ్యాంగ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎడ్ల మోహన్ దాస్, దళిత సంఘ నాయకులు కే. శ్రీనివాస్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితుడికి న్యాయం జరిగేంత వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఘటనకు బాధ్యుడైన ప్రసాద్ రెడ్డి అనే వ్యక్తిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో బాధితులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బాధితులు తమ దృష్టికి తీసుకురావడంతో, ఈ విషయాన్ని మీడియా ద్వారా అధికారులకు తెలియజేశారు. అనంతరం జహీరాబాద్ డీఎస్పీ సైద నాయక్ గారిని కలిసి ఘటన వివరాలు తెలియజేయగా, అనుమానం ఉన్న వ్యక్తుల పేర్లు అందించాలని సూచిస్తూ, బాధితులు ధైర్యంగా ఉండాలని, వారికి న్యాయం జరుగుతుందని డీఎస్పీ భరోసా ఇచ్చినట్లు తెలిపారు.

# వడ్డెర సంఘం ఖమ్మం నియోజకవర్గ అధ్యక్షులుగా కుంచపు కుమార్.... నియామకం



ఖమ్మం, జనవరి 12: వడ్డెర సంక్షేమ సంఘం ఖమ్మం నియోజకవర్గ అధ్యక్షులుగా కుంచపు కుమారు నియమితులయ్యారు. సోమవారం జరిగిన ఆ సంఘం సమావేశంలో ఖమ్మం జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు బత్తుల వీర బాబు నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా కుంచపు కుమార్ మాట్లాడుతూ తనను గుర్తించి పదవి అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని వడ్డెరలను కలుపుకుపోయి వారి సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బత్తుల వీరబాబు, సంఘం సీనియర్ సలహాదారులు వలపు సోమరాజు, సలహాదారులు దేరంగుల బ్రహ్మం, నర్రా ఎల్లయ్య, కుంచపు వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, సంపంగి మల్లయ్య గొడ్డెండ్ల రాము, పల్లపు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవ రావు


ఖమ్మం పట్టణం :- స్వామి వివేకానంద 163వ జయంతి సందర్భంగా ఖమ్మం ఇల్లందు క్రాస్ రోడ్డులోని స్వామి వివేకానంద విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించిన బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవ రావు. ఈ సందర్భంగా వాసుదేవ రావు మాట్లాడుతూ. “లేచి నిలబడు, లక్ష్యాన్ని చేరుకునే వరకు ఆగవద్దు” అనే వివేకానంద సందేశాన్ని స్మరించుకుంటూ, యువతలో ఆత్మవిశ్వాసం, పట్టుదల, దేశభక్తి భావాలు పెంపొందించాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు. ప్రపంచ సర్వమత సమ్మేళనంలో భారతదేశ గౌరవాన్ని ప్రపంచానికి చాటిన స్వామి





వివేకానందుల మహత్తును వివరించారు. భారతదేశాన్ని తక్కువగా చూసే వారి కళ్ళు తెరిపించిన ఆయన ఆలోచనలు విద్యార్థుల్లో గర్వభావాన్ని నింపాయి అన్నారు. అదేవిధంగా వైరా రోడ్డు లోని వీఐహెచ్ఇ సిటీ క్యాంపస్‌లో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించి, స్వామివారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆర్ట్ అఫ్ లివింగ్ ఇంట్యూషన్ ప్రోగ్రాం విద్యార్థులకు స్వామి వివేకానందుల జీవితం, ఆలోచనలు, భారతదేశ గౌరవాన్ని ప్రపంచానికి చాటిన ఆయన మహత్తు గురించి అవగాహన కల్పించారు. వీఐహెచ్ఇ గురుదక్షిణ క్యాంపస్, పోలేపల్లి నందు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించడంతో పాటు, వీఐహెచ్ఇ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ పొందుతున్న వారిని ఉద్దేశించి మాట్లాడారు. యువతే దేశ భవిష్యత్తు అని నమ్మిన స్వామి వివేకానంద ఆదర్శాలను ప్రతి ఒక్కరూ జీవితంలో అమలు చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో బోనాల రామకృష్ణ వీఐహెచ్ఇ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జయంత్ లాల్ పటేల్, కేశవ్ లాల్ పటేల్, నున్న రవికుమార్, వెంకటనారాయణ, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి జూడోకు అర్హత సాధించిన విజ్ఞాన్ -కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అభినందనలు



టేకుమట్ల (సూర్యాపేట జిల్లా), జనవరి టేకుమట్ల గ్రామానికి చెందిన కర్ర శ్రీ విజ్ఞాన్ తండ్రి జ్ఞాన నంద ప్రకాష్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అభినందించారు. షేక్‌పేట గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విజ్ఞాన్, జూడో క్రీడలో ప్రతిభ చాటుతూ జనవరి 22 నుండి 27 వరకు కేరళ, కలకత్తా, ఢిల్లీ నగరాల్లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, “చిన్న వయస్సులోనే జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కడం గర్వకారణం. విజ్ఞాన్ ఇలాగే కృషి చేస్తూ అంతర్జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు పొందాలి” అని ఆకాంక్షించారు. విజ్ఞాన్ సాధించిన ఈ విజయంతో గ్రామంతో పాటు జిల్లా మొత్తం గర్వపడుతోందని స్థానికులు తెలిపారు. క్రీడల్లో విద్యార్థులు రాణిస్తే వారికి ప్రభుత్వంతో పాటు సమాజం మద్దతు ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# మైయికోడ్ గ్రామంలో ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు

సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 12జనవరి సంగారెడ్డి జిల్లా

నారాయణఖేడ్ నియోజకవర్గంలో మానూర్ మండలం పరిధిలో మైయికోడ్ గ్రామంలో ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. జనవరి 12, 1863న కలకత్తాలో జన్మించారు, చిన్ననాటి పేరు నరేంద్రనాథ్ దత్తా, రామకృష్ణ పరమహంస శిష్యుడిగా మారి, ఆయన వేదాంత బోధనలను వ్యాప్తి చేశారు. భారతీయ సంస్కృతి, వేదాంతం, యోగాలను ప్రపంచానికి పరిచయం చేశారు. కేవలం పుస్తక పరిజ్ఞానం కాకుండా, వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం, స్వతంత్ర ఆలోచనలే నిజమైన విద్య లక్ష్యమని బోధించారు. పేదలకు, నిరుపేదలకు సేవ చేయడమే భగవత్ సేవ అని నమ్మారు. యువతలో దేశభక్తి, ఆత్మగౌరవాన్ని పెంపొందించారు. స్వామి వివేకానంద జయంతి మాజీ సర్పంచ్ రేవప్ప కుమారుడు శివ ఆధ్వర్యంలో మానూర్ మండల కేంద్రంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు



సోమవారం స్వామి వివేకానంద 163వ జయంతి ఉత్సవాలు వివేకానంద సేవ సమితి ఆధ్వర్యంలో జరిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పచ్ రేవప్ప కుమారుడు శివ కుమార్ మాట్లాడుతూ...సమాజా జ్ఞాన సంపద యువతకు స్ఫూర్తి దాత స్వామి వివేకానంద అని, వివేనందుడి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్ణం కృష్ణ, వివేకానంద యువజన సంఘాల నాయకులు గాండ్ల సుధాకర్, శివరాజ్, సంగన్, విట్టల్ రెడ్డి, యం. చంద్రకాంత్, బీరప్ప, ప్రవీణ్ కుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

# షైన్ హై స్కూల్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



ఖమ్మం జిల్లా, బోనకల్ ఎ జనవరి 11స్థానిక షైన్ హై స్కూల్‌లో శనివారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హరిదాసు, గోదాదేవి, రైతు వేషధారణలతో పాటు సాంప్రదాయ దుస్తుల్లో అలరించారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించడంతో పండుగ వాతావరణం ఉట్టిపడింది. భోగి మంటలు, సంక్రాంతిని ప్రతిబింబించేలా వరి నాట్లు వేయడం, వరి కోత, పంట నూర్పడం, వడ్లు దంచడం వంటి దృశ్యాలను విద్యార్థులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ అన్సర్ పాషా, డైరెక్టర్ లాల్ మహమ్మద్, ప్రిన్సిపాల్ శ్వేత, అడ్మినిస్ట్రేషన్ అధికారి నాగేశ్వరావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎమ్మెల్యే డాక్టర్ పి సంజీవరెడ్డి స్వగృహంలో ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా

సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 12జనవరి సంగారెడ్డి జిల్లా

నారాయణఖేడ్ నియోజకవర్గంలో శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి స్వగృహంలో, వాయనాడ్ ఎంపీ, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ శ్రీమతి ప్రియాంక గాంధీ జన్మదిన వేడుక ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, పట్లోళ్ల సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రియాంక గాంధీకి శుభాకాంక్షలు తెలియజేసి, కేక్



కటింగ్ జరిగింది. నాయకులు ప్రియాంక గాంధీ శతావధి జీవితం, ఆరోగ్యంతో ప్రజల మధ్య, దేశ రాజకీయ సేవలో ముందుంటారని, భగవంతుడు ఆయంత్రం నిండు నూరేళ్లు ప్రసాదించాలని కోరారు. కేక్ కార్యక్రమం తరువాత, కార్యకర్తలకు తినిపించడం ద్వారా వేడుకను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు, మాజీ మండలం అధ్యక్షులు దామ నాగన్న, కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లు దిగంబర్ రెడ్డి, శివాజీ పటేల్, శ్యామయ్య, మారుతీ, లక్ష్మణ్, శ్రీనివాస్ రెడ్డి, చీూఖ× జిల్లా ఉపాధ్యక్షులు పరుశరామ్ సంజీవ పాటిల్, కాషాయ్య మాజీ సర్పంచ్లు దావీద్, మంచేందర్, బీ. రాజు మరియు ఇతర స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ వేడుక పార్టీ కార్యకర్తలలో ఉత్సాహం మరియు ఏఐసీసీ నాయకత్వానికి గౌరవ భావాన్ని పెంపొందించడంలో ఒక ముఖ్యమైన సందర్భంగా నిలిచింది.

# ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు

**సందేశం టైమ్స్:**



స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని మనోహరాబాద్ మండల వ్యాప్తంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలం లోని పర్కిబండ గ్రామంలో వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకలలో సర్పంచ్ మోతిబాయిలక్ష్మణ్ సింగ్, మాజీ సర్పంచ్ అర్జున్ తదితరులు పాల్గొని వివేకానంద విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వివేకానంద ఆశయం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాల్సిన అవసరం ఎంతయిన అన్నారు. అయన అడుగుజాడల్లో యువత నడువాలని ఆయనను స్ఫూర్తి గా తీసుకుని యువత ముందుకు వెళ్లాలని సూచించారు. అదేవిదంగా మండలం లోని కొనాయిపల్లి గ్రామంలో సర్పంచ్ కళ్యాణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో వివేకానంద జయంతి వేడుకలు పంచాయతి ఆవరణలో వివేకానంద చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో పర్కిబండ ఉప సర్పంచ్ మహేష్ యాదవ్,వార్డు సభ్యులు నరహరి, కుమార్, భాస్కర్ గౌడ్,వివేకానంద యూత్ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, ఉపాధ్యక్షులు నందకిశోర్ నాయకులు ఉపేందర్ రెడ్డి, రమేష్, సోను ఠాకూర్, సాయిలు, కాంతారావు,రాజు,ప్రభాకర్,సాయి,మల్లేష్,యాదగిరి,ఆంజనేయులు, సత్యనారాయణ,శ్రీధర్, నందు, కార్తీక్, సత్యనారాయణ, గణేష్, కిరణ్, రఘువీర్,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## మూడు చింతలపల్లి మున్సిపాలిటీలో బి ఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం

**మేడ్చల్ నియోజకవర్గం మాజీ మంత్రి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు**

**సందేశం టైమ్స్:**




మూడు చింతలపల్లి మున్సిపాలిటీలో అన్ని గ్రామాలతో కలిసి మాజీ ఏఎంసీ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి మాజీ ఎంపిటిసిలు మాజీ సర్పంచులు మాజీ వార్డు మెంబర్లు మీటింగ్ ఏర్పాటు చేసుకున్నారు వచ్చే మున్సిపల్ ఎలక్షన్ లో 24 వార్డులు ఉన్నాయి 24 వార్డులు బిఆర్ఎస్ పార్టీ గెలుపు మనదే అని నియోజకవర్గ ఎమ్మెల్యే అందరికీ ఆదేశాలు ఇవ్వడం కచ్చితంగా ఉన్న ప్రభుత్వం హామీలు నెరవేర్చలేదని ప్రజల్లో చెప్పి ప్రజలకు చైతన్య పరిచేలా ప్రజల్లోకి వెళ్లి బిఆర్ఎస్ చేసినటువంటి పనులు చెప్పుకుంటూ ఈ మున్సిపాలిటీ ఎలక్షన్లో 24 వార్డులు మనం గెలుచుకుంటామని హామీ ఇచ్చారు మీ అందరి సమక్షంలో పార్టీలో అందరూ కష్టపడి పార్టీ కోసం పని చేయాలని ప్రతి గ్రామం నుంచి ప్రతి ఒక్కరు కష్టపడాలని పార్టీ కార్యకర్తలు నా గెలుపుగా తీసుకోవాలని పార్టీ నుంచి ఎవరిని నిలబెడితే వాళ్ళను గెలిపించుకోవాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి పిలుపునిచ్చారు

## కాంగ్రెస్ పార్టీ లో చేరిన ముప్పిరెడ్డిపల్లి సర్పంచి రాజా నరసింహ

**సందేశం టైమ్స్:**



మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామ సర్పంచిగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన కందల రాజనర్సింహ సోమవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ నర్సారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచి శేఖర్ రెడ్డి ఉప సర్పంచి రామ్ రెడ్డి నాయకులు,పాలక వర్గ సభ్యులు, గ్రామ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు ఉన్నారు...

## ఉపాధి కూలీలకు పనిముట్లు పంపిణీ చేసిన : గ్రామ సర్పంచ్




**సందేశం టైమ్స్:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం పాత అల్లిగూడెం గ్రామ పంచాయతీలో ఉపాధికూలీలకు పనిముట్లు పంపిణీ చేసిన సర్పంచ్ కుంజా శ్రీను, వార్డు సభ్యులు, పంచాయతీ సెక్రటరీ స్వతంత్ర తేజ్ గ్రామ పంచాయతీలో ఉపాధికూలీలకు వారి పనులకు అవసరమాయిన పనిముట్లు పంపిణీ చేశారు. అనంతరం మహిళలకు ఇందిరమ్మ చీరలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాత అల్లిగూడెం గ్రామా ప్రజలు, ఉపాధికూలీలు కేంద్రప్రభుత్వం చేపట్టిన నిరుపేదలకు ఉపాధిహామీ పథకము అమలుచేసి పేదల పక్షాన నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వమునకు గ్రామా ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జూపల్లి రమేష్, సుంకవల్లి వీరభద్రం, తుమ్మ రాంబాబు, అప్పలరాజు, చిన్నంశెట్టి సత్యనారాయణ, నంద్రు రమేష్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# పులిపాటి నగర్‌లో ఘనంగా ముగ్గుల పోటీలు

ఖమ్మం, జనవరి 12 ఖమ్మం నగరం లోని మమతా రోడ్డుపై గల పులిపాటి నగర్--2, 20వ డివిజన్ పరిధిలో పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు అంగరంగ వైభవంగా ముగిశాయి. వీక్షకులను ఆకట్టుకునే విధంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఖమ్మం పట్టణంలో కనీవినీ ఎరుగని రీతిలో సుమారు 326 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని తమ కళాత్మక ప్రతిభను ప్రదర్శించారు. ఈ ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు ప్రథమ బహుమతిగా రూ.5,000, ద్వితీయ బహుమతిగా రూ.3,000, తృతీయ బహుమతిగా రూ.2,000 నగదు బహుమతులు ప్రకటించారు. అలాగే పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు కన్సోలేషన్ బహుమతులు







అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ బహుమతులను రిపబ్లిక్ డే సందర్భంగా, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చేతుల మీదుగా, తుమ్మల యుగంధర్ ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఘనంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, ముగ్గుల పోటీలు సాంప్రదాయ సాంస్కృతిని కాపాడడమే కాకుండా మహిళల్లో ఐక్యతను, సామాజిక అనుబంధాన్ని మరింత బలోపేతం చేశాయని తెలిపారు. అంచనాలకు మించి మహిళలు పాల్గొనడంతో కార్యక్రమం ఘన విజయాన్ని సాధించిందని పేర్కొంటూ, సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు డాక్టర్ పులిపాటి ప్రసాద్, యర్నాటి కోటేశ్వరరావు, ఎర్రబోతుల వెంకటేశ్వర రెడ్డి, మంగపతి వీరారెడ్డి, పట్నాయక్ వెంకటేశ్వర్లు, చింతలపూడి పైడిపల్లి నాగేశ్వరరావు, రామచంద్ర రావు, వీరభద్రరావు, కిలారు నీరజ, బైరెడ్డి శ్రీలత, పుల్లయ్య వెంకటేశ్వరరావు, పీవీ సత్యనారాయణ, తుమ్మటి ప్రభాకర్ రెడ్డి, కొంగర మాధవరావు, సుధాకర్ పుల్లారెడ్డి, పాలవాయి వెంకటేశ్వర్లు, తూనుగుంట్ల సంతోష్ చక్రవర్తి, సిద్ధంశెట్టి శ్రీకాంత్, కోదుమూరు భద్రయ్య, కొదుమూరు జగన్నాథం, కొంకిమళ్ళ మృత్యుంజయ గుప్త, గుమ్మడవెల్లి శ్రీనివాస్, మాశెట్టి వరప్రసాద్, కాజా వెంకటేశ్వర్లు, వందనపు సామ్రాట్ గుప్తా, పులిపాటి నగర్ ప్రాంతవాసులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

**- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**
**-ప్రతి ఫిర్యాదుపై పారదర్శక విచారణకు ఆదేశాలు**
**బాధితులకు భరోసా**

**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 12జనవరి**





ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం అందించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఎస్పీ స్వయంగా ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విచారణ చేపట్టి బాధితులకు పూర్తి న్యాయం చేయాలని అధికారులకు ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్లలో పరిష్కారం కాని సమస్యలపై ఎలాంటి భయాలు, ఒత్తిళ్లకు లోనుకాకుండా ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని జిల్లా ప్రజలకు సూచిస్తూ, స్వీకరించిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేకంగా పర్యవేక్షించి త్వరితగతిన పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ భరోసా ఇచ్చారు.

## ముదిమాణిక్యంలో ఘనంగా స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలు

**సందేశం టైమ్స్:అందోల్ నియోజకవర్గం ఇంచార్జి 12జనవరి**



యువజన స్ఫూర్తి ప్రదాత, యువతకు ఆదర్శప్రాయుడు స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలను సంగారెడ్డి జిల్లా ముదిమాణిక్యం గ్రామంలో గ్రామ సర్పంచ్ పడమటి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, యువతను జాగృతం చేసిన స్వామి వివేకానంద గారి ఆలోచనలు, ఆదర్శాలు నేటికీ దేశ యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఆయన చూపిన విలువల బాటలో నడుచుకుంటూ దేశ నిర్మాణంలో యువశక్తి కీలక పాత్ర పోషిస్తూ మరింత బలంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న పుర దుర్గయ్య, ఇందూరి మోహన్ మాట్లాడుతూ స్వామి వివేకానంద విగ్రహాన్ని ఇద్దరూ కలిసి సమిష్టిగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డ్ మెంబర్లు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఈరోజు స్వామి వివేకానంద163 వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళి

**సందేశం టైమ్స్: నారాయణఖేడ్ ఇంచార్జి జనవరి 12**

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ప్రభు గౌడ్ మాట్లాడుతూ వివేకానందడుచూపించిన బాటలో నేటి యువత నడుచుకుని క్రమశిక్షణతో మెలగాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సురేందర్ న్యాయవాది జిల్లా అధ్యక్షులు పట్లోళ్ల మల్లికార్జున్ పాటిల్ మరియు కార్యదర్శులు సుధాకర్ గౌడ్, గౌలీశ్వర్ శ్రీనివాస్ ఆంజనేయులు ఫోరం అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర కొంక రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో తెలంగాణ జట్టు ఘన విజయం...

**సందేశం టైమ్స్ సంగారెడ్డి టౌన్ ప్రతినిధి (జనవరి 12)**



జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్--14 కబడ్డీ పోటీల్లో తెలంగాణ జట్టు అద్భుత ప్రదర్శనతో నాలుగో స్థానం సాధించింది.
ఈ సందర్భంగా పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి గారు జట్టు సభ్యులను ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు జాతీయస్థాయిలో ప్రతిభ చూపడం గర్వకారణమని పేర్కొన్నారు. మైత్రి మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో సామాజిక సేవలో ముందుంటున్న మాద్రి పృథ్వీరాజ్ గారు ప్రత్యేకంగా పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు. యువత క్రీడల్లో ముందుకు సాగేందుకు ఇలాంటి కార్యక్రమాలు ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, జట్టు మేనేజర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## బిజిలీపూర్‌లో కొత్త ఆకాశ దీపాల ఏర్పాటు

**-చక్రాల నాగమణి నర్సింలు ఆధ్వర్యంలో**

**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 12 జనవరి**



సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం పరిధిలో బిజిలీపూర్ గ్రామంలో కొత్త ఆకాశ దీపాలను ఏర్పాటు చేశారు. గత రెండు సంవత్సరాలుగా మరమ్మత్తులకు నోచుకోని ఆకాశ దీపాల స్థానంలో, తాజాగా ఎన్నికైన సర్పంచ్ నాగమణి నర్సింలు చొరవతో కొత్త దీపాలను అమర్చడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో రాత్రి వేళల్లో వెలుగులు పెరిగి ప్రజలకు సౌకర్యం కలిగిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు."గ్రామ అభివృద్ధే మా లక్ష్యం.. ప్రజలకు మౌలిక వసతులు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదు" – సర్పంచ్ నాగమణి నర్సింలు "ఎన్నికల హామీలను అమలు చేస్తూ గ్రామంలో అవసరమైన పనులను దశలవారీగా చేపడుతున్నాం" – మాజీ ఎంపీటీసీ సదానందం"భద్రత, సౌకర్యం దృష్ట్యా ఆకాశ దీపాల ఏర్పాటు ఎంతో ఉపయోగకరం" -- ఉప సర్పంచ్

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.